96,673 మందికి పోలియో చుక్కలు

పార్వతీపురం(ఆంధ్రజ్యోతి)/సాలూరు రూరల్: జిల్లాలో 98,991 మంది చిన్నారులకు గాను ఆదివారం 96,673 (97.65 శాతం) మందికి పోలియో చుక్కలు వేసినట్టు డీఎంహెచ్‌వో జగన్నాథరావు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న చిన్నారులకు సోమ, మంగళవారాల్లో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని చెప్పారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ పార్వతీపురంలో పలువురి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగన్నాథరావు, ఐటీడీఏ ఉపఆరోగ్యశాఖాధికారి శివకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

ప్రమాద ఘంటికలు



ఎడమ కాలువ నుంచి సాగునీరు నిలుపుదల చేసిన దృశ్యం

- 'తోటపల్లి'లో తగ్గిన స్టోరేజ్
- ప్రస్తుతం 1.370 టీఎంసీలే నిల్వ
- వేసవిలో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం
- అప్రమత్తమైన అధికారులు
- కాలువలకు నీటి సరఫరా నిలిపివేత
- ఇప్పటికే పంటలు సాగుచేసిన రైతుల్లో ఆందోళన

తోటపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. 2.534 టీఎంసీల నుంచి 1.370 టీఎంసీలకు స్టోరేజ్ పడిపోయింది. దీంతో వేసవిలో ఉత్తరాంధ్ర జిల్లాలకు తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఏర్పడింది. ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై కాలువలకు నీటి సరఫరాను నిలుపుదల చేశారు. అయితే, పాలకుల మాటలు నమ్మి రబీ సాగుకు ఉప్రక్రమించిన రైతులు ఇప్పుడు తోటపల్లి నీరు నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

గరుగుబిల్లి, మార్చి 3

తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు నుంచి రెండు ప్రధాన కాలువలకు నీటి సరఫరాను అధికారులు నిలుపుదల చేశారు. గత కొన్నాళ్లుగా తోటపల్లిలో నీటి నిల్వలు పుష్కలంగా ఉండేవి. కుడి, ఎడమ ప్రధాన కాలువల నుంచి ఖరీఫ్, రబీకి అందించినా నీటినిల్వలు సమృద్ధిగా ఉండేవి. అయితే ఈ ఏడాది అనుకున్న మేర వర్షాలు కురవకపోవడంతో పైనుంచి ప్రాజెక్టులోకి నీరు చేరని దుస్థితి ఏర్పడింది. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను ప్రస్తుతం 102.98 మీటర్లకు నీరు చేరుకుంది. ప్రాజెక్టుకు సంబంధించి నిల్వ సామర్థ్యం 2.534 టీఎంసీలకు గాను 1.370 టీఎంసీలకు చేరడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది. ప్రాజెక్టులో అనూహ్యంగా నీటి నిల్వలు తగ్గు ముఖం పట్టడంతో గేట్లను దించి కాలువలకు సరఫరాను నిలుపుదల చేశారు. ఇప్పుడు మేల్కొనకపోతే వేసవిలో ఉత్తరాంధ్ర జిల్లాలకు తీవ్ర తాగునీటి సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి కాలువలకు నీటిని ఆపేశారు.

రైతుల్లో ఆందోళన..

నెల రోజుల క్రితం ఉల్లిభద్రలోని కుడి ప్రధాన కాలువ నుంచి 600 క్యూసెక్కుల నీటిని చెరువులు, తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. ఆ సమయంలో ఎడమ ప్రధాన కాలువ, పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి కాలువ నుంచి నీరు సరఫరా చేయలేదు. అయితే తాగునీటి అవసరాలకు విడుదల చేసిన నీటిని పలు ప్రాంతాలకు చెందిన రైతులు రబీలో పంటల సాగుకు ఉపయోగించారు. ప్రాజెక్టు అధికారులతో మాట్లాడమని, సాగు నీటికి ఇబ్బంది లేదని అధికార పార్టీకి చెందిన ప్రతినిధులు చెప్పడంతో రైతులు రబీలో సాగుకు ఉప్రక్రమించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నాయకులు హామీ ఇచ్చినా ఇప్పుడు ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు గేట్లు దించారు. కుడి, ఎడమ కాలువల పరిధిలో రైతులు వందల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ప్రస్తుతం నీటి సరఫరా నిలుపుదల చేయడంతో ఏమి చేయాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పులు చేసి వేలాది రూపాయలు మదుపులు పెట్టామని, ఇప్పుడు నీటి నిలుపుదలతో పంటలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకుల మాటలు నమ్మి మోసపోయామని మండిపడుతున్నారు.



ప్రాజెక్టు గేట్లను మూసివేస్తున్న అధికారులు

ఇబ్బందులు లేకుండా చర్యలు..

తోటపల్లి ప్రాజెక్టు నుంచి పార్వతీపురం పట్టణంతో పాటు నారాయణపురం, తదితర ప్రాంతాలకు తాగునీటికి కొరత లేకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం అధికంగా ఎండలు కాస్తుండడంతో తాగునీటి సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంది. ప్రజల అవసరాలను గుర్తించి సాగుకు కాకుండా తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. కాలువల నుంచి లీకుల రూపంలో కొంతమేర, తాగునీటి అవసరాలకు కొంతమేర సరఫరా చేయ డంతో నీటి నిల్వలు తగ్గాయి. ఇప్పుడు సాగు నీటిని విడుదల చేస్తే ప్రాజెక్టు అడుగంటే ప్రమాదం ఉంది. వేసవిలో తాగునీటికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆరుతడి పంటలకు సాగునీరు సరఫరా చేసే అవకాశం లేదు. దాహార్తిని తీర్చేందుకే విడుదల చేస్తున్నాం. రైతులు గ్రహించాలి.

-కిశోర్‌కుమార్, తోటపల్లి ప్రాజెక్టు జేఈ, పార్వతీపురం

పొలంలోకి దూసుకెళ్లిన ట్రావెల్ బస్సు

- ప్రమాదం నుంచి బయటపడిన కాశీ యాత్రికులు
- ఐదుగురికి స్వల్ప గాయాలు



పొలంలోకి వెళ్లడంతో దెబ్బతిన్న బస్సు



గరుగుబిల్లి, మార్చి 3: పార్వతీపురం నుంచి కాశీకి యాత్రీకులతో బయలుదేరిన ట్రావెల్ బస్సు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా మిగతా వారంతా ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ ఘటన మండలంలోని చిలకాం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. పార్వతీపురం నుంచి కాశీ తీర్థ యాత్రకు 22 మంది ప్రైవేటు ట్రావెల్ బస్సులో ఆదివారం వేకువజామున 3 గంటల సమయంలో బయలుదేరారు. తొలుత శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి పుణ్య క్షేత్రాన్ని దర్శించుకునేందుకు వెళ్తుండగా ప్రయాణం ప్రారంభమైన కొద్ది సేపటికే మండలంలోని చిలకాం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న బస్ షెల్టర్‌ను ఢీకొని పంట పొలాల్లోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు యాత్రికులకు స్వల్ప గాయాలయ్యాయి. మిగతా వారు క్షేమంగా బయటపడ్డారు. గాయపడిన వారిని పార్వతీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదాలకు నిలయంగా చిలకాం మలుపు..

చికలాం మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని రోజుల కిందట తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన 15 మంది ఆటోలో వివాహానికి వెళ్తుండగా చికలాం మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వారంతా గాయపడ్డారు. అలాగే రావివలసకు చెందిన ఓ వ్యక్తిని ఈ మలుపులోనే లారీ ఢీకొనడంతో మృతి చెందాడు. మలుపు వద్ద స్పీడు బ్రేకర్లతో పాటు హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ అన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యాత్రికురాలు

మంచి వారిని ఎన్నుకోండి

- ఎన్నికల ప్రచార చిత్రాలను విడుదల చేసిన టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, మార్చి 3: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మంచి వారిని చట్ట సభలకు ఎన్నుకోవాలని టీడీపీ సీనియర్ నేత అశోక్‌గజపతిరాజు సూచించారు. ఆదివారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన డిజిటల్ చిత్రాలు, వీడియోలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ ఐదేళ్ల పాలన నిరంకుశంగా సాగిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరంకుశ విధానాలు చెల్లవని, రానున్న ఎన్నికల్లో ఈ పాలకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ హయాం నుంచే పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి జరుగుతూ వస్తోందని, ఆ తరువాత బాధ్యతలు చేపట్టిన వారు కూడా సంక్షేమ పథకాలు కొనసాగించారన్నారు. టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితిగజపతిరాజు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు లాంటి విజనరీ నాయకుడు ప్రస్తుతం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, పి.రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోరుకొండ రోడ్డులో టీడీపీ నాయకుడు పి.రాజేష్ వర్మ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

నిర్లక్ష్యమే పెను ప్రమాదమైందా!

- క్రికెట్ చూస్తూ రైలు డ్రైవింగ్
- కంటకాపల్లి ప్రమాదంపై సంచలన విషయాలు వెల్లడించిన రైల్వే మంత్రి
- కొత్తవలస-కంటకాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గతేడాది ఘటన



రైళ్ల ప్రమాదంలో నుజ్జయిన విశాఖ-రాయగడ పాసింజర్ రైలు ఇంజిన్ (ఫైల్)

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

అది ఘోరమైన రైలు ప్రమాదం.. జరిగి నాలుగు నెలలు దాటింది. అయినా నేటికీ జిల్లా వాసుల మనసును కలచివేస్తూనే ఉంది. కొత్తవలస- కంటకాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య రెండు రైళ్లు ఢీకొన్న ఆ దుర్ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరెందరో తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఆ మాటలకందని విషాదానికి డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమని తాజాగా రైల్వే మంత్రి ప్రకటించడంతో జిల్లా ప్రజలు విస్మయ్యారు. పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్‌లు సెల్‌ఫోన్‌లో క్రికెట్ పోటీలను వీక్షిస్తూ రైలు నడిపిన కారణంగా ఈ దుర్ఘటన జరిగినట్టు మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక బాధితుల కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

రైల్వే శాఖ చేపడుతున్న భద్రతా చర్యలకు సంబంధించిన వివరాలను మంత్రి చెబుతూ కొత్తవలస-కంటకాపల్లి మధ్య జరిగిన రైలు ప్రమాదాన్ని కూడా వెల్లడించారు. ఇంతవరకు సిగ్నలింగ్ సమస్య కారణంగానే ఆ ఘోర ప్రమాదం జరిగినట్లు అందరూ భావిస్తున్నారు. ఇప్పుడు కొత్త అంశం తెరపైకి వచ్చింది. గతేడాది అక్టోబరు 29న సాయంత్రం 6.30- 7గంటల మధ్య రైలు ప్రమాదం జరిగింది. సిగ్నల్ కోసం వేచిచూస్తూ విశాఖ-పలాస పాసింజర్ రైలు కొత్తవలస-కంటకాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆగి ఉంది. దీని వెనుకే విశాఖ-రాయగడ పాసింజర్ రైలు వస్తోంది. అప్పటికే రెండు స్టేషన్ల మధ్య ఆటో సిగ్నల్ కోసం ట్రాక్‌పై వేచిచూస్తున్న పలాస రైలును గమనించకుండా రాయగడ రైలు బలంగా వచ్చి ఢీ కొట్టింది. ఆ ప్రమాదంలో విశాఖ-రాయగడ రైలు నడుపుతున్న పైలెట్, సహాయ లోకో పైలెట్ ఇద్దరూ మృతి చెందారు. మొత్తంగా 14 మంది మృతి చెందటంతో ఆ దుర్ఘటన దేశ వ్యాప్తంగా సంచలనమైంది. అయితే ఇంతవరకు ఈ ప్రమాదానికి ఆటో సిగ్నలింగ్ సిస్టం కారణమని అంతా భావించారు. ఉన్నట్టుండి ఈ ప్రమాదానికి సంబంధించిన దర్యాప్తు నివేదిక అంశాలను రైల్వే మంత్రి బయట పెట్టారు. ఆ ప్రమాదంలో జిల్లాకు, ఒడిశాలోని రాయగడ ప్రాంతానికి చెందిన వారే ఎక్కువ మంది మృతి చెందారు. బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకున్నా పెద్ద దిక్కును కోల్పోయి నేటికీ ఆ విషాదం నుంచి కుటుంబ సభ్యులు బయటపడలేకపోతున్నారు.

పార్వతీపురం వైసీపీలో మూడు ముక్కలాట

- టికెట్ నాదే అంటున్న సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి
- కాదు నాకే ఇస్తారంటున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్
- నేనూ ఉన్నానంటున్న మాజీ ఎమ్మెల్యే జయమణి



(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం నియోజకవర్గం వైసీపీ టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి పోటీ పడుతున్నారు. అయితే, జోగారావు, ప్రసన్నకుమార్ మధ్యే తీవ్ర పోటీ నెలకొంది. మళ్లీ తనకే టికెట్ వస్తుందని ఎమ్మెల్యే అలజంగి చెబుతుండగా, కాదు ఈసారి అధిష్ఠానం తనకే టికెట్‌ను ఖరారు చేస్తుందని ప్రసన్నకుమార్ అంటున్నారు. ఈ మేరకు ఎవరికివారే ప్రచారం చేసుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసన్నకుమార్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. దీంతో 2019 ఎన్నికల ముందు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను జోగారావుకు అప్పగించారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత నుంచి నియోజకవర్గంలో వైసీపీ రెండు గ్రూపులుగా చీలిపోయింది. అసంతృప్తితో ఉన్న ప్రసన్నకుమార్‌కు అధిష్ఠానం టిడ్కో చైర్మన్ పదవిని కట్టబెట్టింది. కాగా, ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు జోగారావు, ప్రసన్నకుమార్, జయమణి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అనుచరుడైన జోగారావు తనకే టికెట్ దక్కుతుందని ధీమాగా ఉన్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన వైసీపీ రాష్ట్రస్థాయిలో సమావేశంలో ముఖ్యమంత్రే స్వయంగా చెప్పినట్టు జోగారావు వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. అయితే, ఎట్టి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో టిక్కెట్ తమదేనంటూ ప్రసన్నకుమార్‌తో పాటు ఆయన వర్గీయులు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో అవకాశం ఇస్తానని 2019లోనే జగన్ మాట ఇచ్చారని ప్రచారం చేస్తున్నారు. అందుకే జోగారావు గెలుపునకు ఆ ఎన్నికల్లో కష్టపడినట్లు ప్రసన్న వర్గీయులు చెబుతున్నారు. మరోపక్క తనకూ అవకాశం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి సైతం అధిష్ఠానాన్ని కోరుతున్నారు. టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోన్నారు. దీంతో టిక్కెట్ ఎవరికి దక్కుతుందోనన్న ఆసక్తి అందరిలో నెలకొంది.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే..

- జీవో నెం.3 పునరుద్ధరించాలి
- యూటీఎఫ్ డిమాండ్

బెలగాం, మార్చి 3: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేస్తానని పాదయాత్రలో ఇచ్చిన హామీని సీఎం జగన్మోహన్ రెడ్డి తుంగలోకి తొక్కారని మండిపడ్డారు. జీపీఎస్ ప్రవేశపెట్టి ఉద్యోగులను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జీవో నెం.3ని పునరుద్ధరించాలని, జీవో 17ని ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు వర్తింప చేయాలని, ప్రతి జీపీఎస్ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, డీఎస్సీ నుంచి సీఆర్టీలను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఒకటో తరగతిలో చేరేందుకు ఆరు సంవత్సరాలు నిండాలనే నిబంధనకు వ్యతిరేకంగా ఈ నెల 5, 6 న మండలశాఖ ఆధ్వర్యంలో నిరసనలు తెలపాలని, ఈ నెల 11న గిరిజన విద్యారంగంపై పోరాడాలని కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రమేష్, యూనియన్ నాయకులు ఎ.భాస్కరరావు, వి.జ్యోతి, కె.మురళి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నిండు జీవితానికి రెండు చుక్కలు

- జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం


కురుపాం రూరల్‌లో..


గరుగుబిల్లి: చిలకాంలో..


గరుగుబిల్లి: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో జగన్నాథరావు


మక్కువలో..


భామిని: బాలేరులో

కురుపాం రూరల్: జిల్లాలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మొండెంఖల్ పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో 2,366 మందికిగాను 2,322 మంది పిల్లలకు చుక్కల మందు వేసినట్టు వైద్యురాలు బి.ప్రజ్ఞ తెలిపారు. నీలకంఠాపురం పీహెచ్‌సీ పరిధిలో కూడా కార్యక్రమం జరిగింది. ● **కురుపాం:** రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కురుపాం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఎంపీపీ శెట్టి పద్మావతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ● **మక్కువ:** స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో 2,922 మంది చిన్నారులకుగాను 2,808 మందికి పోలియో చుక్కలు వేశారు. శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 2,530 మందికిగాను 2,441 మందికి వ్యాక్సిన్ వేశారు. ● **కొమరాడ:** మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీడీవో మల్లిఖార్జునరావు, వైద్యుడు అరుణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. సిబ్బంది పాల్గొన్నారు. ● **జియ్యమ్మవలస:** రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ పరిధిలో ఇటుకల బట్టీల వద్ద ఉన్న కుటుంబాల వద్దకు వెళ్లి వారి పిల్లలకు వైద్యుడు చీకటి శంకరరావు పోలియో చుక్కలు వేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** మండలంలో 3,061 మంది చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను వేశామని తాడికొండ పీహెచ్‌సీ వైద్యులు అభిలాష్, బుద్దేశ్వరరావు తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 59 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిక్కబాయి పల్స్‌పోలియో కేంద్రంలో జిల్లా ఎఫ్‌డీపీ నోడల్ అధికారి వినోద్ కుమార్, వైద్యులు శ్రీధర్ పరిశీలించారు. సీహెచ్‌వో పద్మ, హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీను పాల్గొన్నారు. ● **భామిని:** మండలంలో 97.6 శాతం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు బాలేరు వైద్యాధికారి దీపిక, వైద్యులు దామోదర్, సోలో తెలిపారు. ● **వీరఘట్టం:** చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని డాక్టర్ పాలవలస ఉమామహేశ్వరి అన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కొట్టుగుమ్మడలో టీడీపీ మండలాధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ చిన్నారులకు పోలియో చుక్కలువేశారు. ● **పాలకొండ:** పట్టణంలోని ముదునూరువారి వీధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ పోలియో చుక్కలు వేశారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు కమిషనర్ సర్వేశ్వరరావు పోలియో చుక్కలు వేశారు. అంపిలి గ్రామంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి వెన్నెల పల్స్‌పోలియో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరఘట్టం మండలంలోని వండువ గ్రామంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ● **గరుగుబిల్లి:** చిలకాంలో ఆదివారం అరకు బీసీ సెల్ టీడీపీ అధికార ప్రతినిధి డి.సత్యనారాయణ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రావివలసలో ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్ పాల్గొన్నారు. ● **సీతానగరం:** బలిజిపేట మండలంలో పి.చాకరాపల్లి, మురగడాం, అజ్జాడ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు తనిఖీ చేశారు. వ్యాక్సిన్ వీవీఎం పరిశీలిస్తూ ఉండాలని సిబ్బందికి సూచించారు. వైద్యులు పాల్గొన్నారు.


సాలూరు రూరల్: ఎగువశెంబిలో పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్

కొఠియా గ్రూపు గ్రామాల్లో..

సాలూరు రూరల్: ఏవోబీలోని కొఠియా గ్రూపు గ్రామాల్లో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఎగువశెంబిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో డి.శివకుమార్ ప్రారంభించారు. సాలూరు పట్టణం డబ్బివీధి పాఠశాలలో డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రారంభించారు. డీఎంహెచ్‌వో జగన్నాథరావు పాల్గొన్నారు. సాలూరు అర్బన్, రూరల్‌లో 11,170 మంది చిన్నారులకు పల్స్‌పోలియో లక్ష్యంగా కార్యాచరణ చేశారు. వారిలో తొలి రోజు 10793 మంది చిన్నారులకు పల్స్‌పోలియో వేశారు. సాలూరు మండలంలో తోణాం, మామిడిపల్లి పీహెచ్‌సీల పరిధిలో పలు పల్స్ పోలియో బూత్‌లను డిప్యూటీ డీఎంహెచ్‌వో శివకుమార్ పరిశీలించారు.

నిర్లక్ష్యం తగదు: డీఎంహెచ్‌వో

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని డీఎంహెచ్‌వో బి.జగన్నాథరావు ఆదివారం తనిఖీచేశారు. ఆ సమయంలో ఏఎన్‌ఎం లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యం తగదని, బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో బిడ్డిక చిన్నమ్మి, తదితరులు ఉన్నారు.


జియ్యమ్మవలస: ఇటుక బట్టీల వద్ద నివసిస్తున్న పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు శంకరరావు


వీరఘట్టంలో..


కొమరాడలో..


గుమ్మలక్ష్మీపురం: దుమ్మంగిలో..


పాలకొండ: అంపిలిలో..

జనసేనలో వైసీపీ నాయకుల చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవి

భోగాపురం: నెల్లిమర్ల మండలంలోని మొయిదకు చెందిన వైసీపీ నాయకులు మీసాల గౌరినాయుడు తన అనుచరులతో జనసేనలో చేరారు. ఆదివారం ముంజేరులోని జనసేన కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి ఆధ్వర్యంలో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక వైసీపీ నేతల తీరుతో విసుగు చెంది పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జన సైనికులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంకండి

- జనసేన ఆత్మీయ సమావేశం


ఆత్మీయ సమావేశం పాల్గొన్న జనసేన నాయకులు

బెలగాం: జనసేన నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఎన్నికలకు సిద్ధం కావాలని ఆ పార్టీ నాయకుడు చందక అనీల్ పిలుపునిచ్చారు. పార్వతీపురంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో జనసేన పట్టణ నాయకుల ఆత్మీయసమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాజకీయ వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, టీడీపీ-జనసేన ఉమ్మడి కార్యక్రమాలను వివరించాలని, ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజాన రాంబాబు, సిరిపురపు గౌరీ, కాళీ, ఎన్.సురేష్, బి.శిరీష్, బి.గోవిందమ్మ, వి.నాని, ఎస్.శీను, పి.శ్రీను పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

- చినమేరంగి సీఐ మురళీధర్


ఖడ్గవలస సముదాయంలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

గరుగుబిల్లి: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని చినమేరంగి సీఐ కె.మురళీధర్ అన్నారు. శనివారం అర్ధరాత్రి సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ పరిశీలనలో ఎస్ఐ వై.అమ్మన్నరావు, సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం

జియ్యమ్మవలస: ప్రస్తుతం గ్రామాల్లో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున మూడంచెల వ్యూహంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చినమేరంగి సీఐ కె.మురళీధర్ తెలిపారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వరుస దొంగతనాలు జరిగిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా చినమేరంగి సర్కిల్ ఆఫీసు పరిధిలో ఖడ్గవలస, ఎర్రన్నగుడి, పెదమేరంగి కూడలి, తదితర ప్రధాన ప్రదేశాల్లో రేయింబవళ్లు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్ఐలకు గానీ, 100కు గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. చినమేరంగి ఎస్ఐ ఇ.చిన్నంనాయుడు సెల్ నెంబరు 9121109478, జియ్యమ్మవలస ఎస్ఐ పి.అనీష్ సెల్ నెం.9121109479, గరుగుబిల్లి ఎస్ఐ వై.అమ్మన్నరావు సెల్ నెం.9121109469 గానీ, సీఐ కె.మురళీధర్ సెల్ నెం.8977519107 గానీ సమాచారం అందించాలన్నారు. ఇటీవల గరుగుబిల్లి మండలం ఖడ్గవలస జంక్షన్ వద్ద జరిగిన దొంగతనం నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు. దీనిపై 9 బృందాలుగా గాలింపు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బెలగాం: పార్వతీపురంలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం స్థానిక పోలీసులు పలు చోట్ల ముమ్మర తనిఖీలు చేపట్టారు. పలు లాడ్జీలలో, బస్టాండ్ కూడలి వద్ద, ఫ్లైఓవర్ పైన తనిఖీలు చేశారు. ఒడిశా నుంచి మద్యం, సారా, గంజాయి తదితర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నిఘా పెంచినట్లు ఏఎస్పీ సునీల్ షరోన్ చెప్పారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణారావు, ఎస్ఐ సంతోషి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'పదో తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్'

సాలూరు రూరల్: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ అని డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. మావుడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ సీఎం, రోజమ్మ దంపతుల ఆర్థిక సాయంతో సరస్వతీదేవి విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అలాగే మండలంలో కాషాయవలస, పులివలస, మావుడి, తుండ తదితర గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మావుడిలో ఆర్బీకేని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రెడ్డి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

రాజాం రూరల్: రాజాంలోని చీపురుపల్లి రోడ్‌లోని గాయత్రీ వేదమాత సన్నిధానంలో ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి 31వ వార్షిక జాతర మహోత్సవాలు ముగింపు పురస్కరించుకుని రెండు వేల మందికి అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, వివేకానందరావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

సూర్యపీఠంలో సౌర హోమాలు

పార్వతీపురంటౌన్: స్థానిక సూర్యపీఠంలో ఆదివారం సౌరదీక్షలో భాగంగా పీఠాధిపతి వేమకోటి నరహరశాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితుడు వి.వివేకానంద, ఋత్వికుల వేదమంత్రోచ్ఛారణల మధ్య మహాసౌర, సుదర్శన హోమాలతో పాటు ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం సూర్య అథర్వశీర్ష, సర్పసూక్త మంత్ర పారాయణాలు నిర్వహించారు. ఈసందర్భంగా వివేకానంద మాట్లాడుతూ ప్రతి ఆదివారం శ్రీ సూర్యపీఠంలో లోకశాంతి కోసం యజ్ఞాలు, హోమాలు నిర్వహిస్తామని చెప్పారు.


శ్రీసూర్యపీఠంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

60 గిరిజన కుటుంబాలు టీడీపీలో చేరిక


గిరిజనులకు కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పెంగువ, రాయిగడ, జమ్ము గ్రామాలకు చెందిన 60 గిరిజన కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయిక జగదీశ్వరి, నాయకుల సమక్షంలో వారంతా వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కద్రక మల్లేష్, టీడీపీ మహిళా ప్రధాన కార్యదరి వెంకటాపు భారతి, గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, కార్యదర్శి పోలారి శ్రీనివాసరావు, రాయగడ, జమ్మూ, మాజీ సర్పంచ్ కె.జ్యోతి, యూనిట్ ఇన్‌చార్జి అనీల్ సోమారావు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

వీరఘట్టం: బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం వీరఘట్టంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్క కార్యకర్త నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం కుటుంబ సాధికార సారథులకు ఆయన సూపర్‌సిక్స్ కార్డులను అందించారు.

స్పిల్‌వే గేట్లకు మరమ్మతులు

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని స్పిల్‌వే గేట్లుకు అవసరమైన మరమ్మతులు చేపడు తున్నారు. ప్రాజెక్టుకు వరద ప్రవాహం వచ్చే సమయంలో ఎటువంటి మొరాయింపులు ఉండ కుండా ఉండేందుకు ముందస్తుగా మరమ్మ తులు చేపడుతున్నామని ప్రాజెక్టు డీఈ రఘునాథ నాయుడు, జేఈ కిషోర్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం వర్షాలు ఎడబాటు కారణంగా 9 గేట్లును నిశితంగా పరిశీలించి అవసరమైన గ్రీస్,బాక్సులు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టుకు ప్రతి ఏటా మెయింటెన్స్‌కు రూ.12లక్షలు కేటాయింపు జరిగిందన్నారు. ఈ నిధులతో అవసరమైన మరమ్మతులు, లస్కర్లకు వేతనాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో సిబ్బంది కె.రామకృష్ణతో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కావాలి

- జనసేన పార్టీ గజపతినగరం నియోజకవర్గం ఇన్‌చార్జి సురేష్


మాట్లాడుతున్న సురేష్

గంట్యాడ: ఎన్నికల ప్రక్రియలో అందరూ భాగస్వామ్యం కావాలని జనసేన పార్టీ గజపతినగరం నియోజకవర్గం ఇన్‌చార్జి మర్రాపు సురేష్ పిలుపునిచ్చారు. బుడతనాపల్లి గ్రామంలో ఆదివారం జనసేన నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్ స్థాయిలో ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలు జనసేన, టీడీపీకి మద్దతుగా ఉన్న తరుణంలో ఇరు పార్టీలు సమన్వయంలో పని చేయాలని కోరారు. జనసేన నాయకుడు మిడతాన రవికుమార్ వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బమ్మిడి ఎర్నినాయుడు, సత్యనారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు

- 5న చినమేరంగి పోలీస్‌స్టేషన్ ప్రారంభం

జియ్యమ్మవలస: చినమేరంగిలో నిర్మించిన సర్కిల్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్ భవన ప్రారంభోత్సవానికి పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నెల 5వ తేదీన ప్రారంభోత్సవానికి రంగం సిద్ధం చేశారు. గతనెల 26న 'ఇంకా పరాయి పంచనే' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 5న ప్రారంభోత్సవం చేస్తామన్న విషయం సీఐ కె.మురళీధర్ తెలిపారు.

ఏజెన్సీకి సీఆర్‌పీఎఫ్ బలగాలు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, కురుపాంఏజెన్సీలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎన్నికల నేపథ్యంలో సీఆర్‌పిఎఫ్ బలగాలు ఆదివారం చేరాయి.బలగాలకు ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో వసతులు సమకూర్చారు. నక్సల్స్‌ప్రభావిత ప్రాంతం కావడంతో బలగాలను తరలించినట్లు తెలిసింది.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి


మాట్లాడుతున్న బత్తిన మోహన్

పాలకొండ: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు బత్తిన మోహన్ పేర్కొన్నారు. పాలకొండ ఆదివారం విలేకరులతో మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రత్యేక హోదా వస్తుందన్నారు. సమావేశంలోకాంగ్రెస్ నాయకులు శ్రీను, చంటిబాబు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న మల్లి సీవోఈలో ఇంటర్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి పీవీటీజీ విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆదాయం లక్ష రూపాయలు దాటకుండా ఉండాలని తెలిపారు. ఎంపీసీలో 40 సీట్లు, బీఐపీసీలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీసీ విద్యార్థులకు ఇంటర్‌తో పాటు ఐఐటీ కోచింగ్, బీఐపీసీ విద్యార్థులకు ఇంటర్‌తో పాటు ఎన్‌ఈఈటీ (మెడికల్) కోచింగ్‌తో పాటు ఈఏఎంసీఈటీ (ఏపీఈఏపీసీఈటీ) కోచింగ్ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈనెల 25లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ ఏడో తేదీన పరీక్ష జరుగుతుందని చెప్పారు.

అన్నసత్రం భవనం ప్రారంభం

పాలకొండ: పట్టణంలోని ముదునూరువారివీధిలో దివంగత బెవర వేణుగోపాలనాయుడు అన్నసత్రం కోసం పునర్నిర్మించిన భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈభవనం రూ.30 లక్షలతో నిర్మించగా వేణుగోపాలనాయుడు కుటుంబ సభ్యులు ఆరులక్షలు ఇవ్వగా, మిగిలిన నిధులు దేవదాయశాఖ నుంచి కేటాయించి నిర్మాణం చేపట్టారు.కార్య క్రమంలో శాసనమండలి ప్రభుత్వవిప్ పాలవలస విక్రాంత్, వేణు గోపాలనాయుడు కుటుంబ సభ్యులు శశిభూషణరావు, కొంచాడ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కోరికాన గంగునాయుడు, కొంచాడ అరుణ్, దుప్పాడ పాపినాయుడు, తూముల లక్ష్మణరావు, పల్లా భాను, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభించని పనులు రద్దు చేయాలి

- పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి
- రెండు డివిజన్ల ఇంజినీర్లతో సమీక్ష

బొబ్బిలి: ఇంకా ప్రారంభించని భవనాల నిర్మాణ పనులను రద్దు చేసి, తాజాగా ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీరు ఎం.కృష్ణారెడ్డి ఆదేశించారు. బొబ్బిలి మండల పరిషత్ సమావేశ హాలులో ఆదివారం సాయంత్రం ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. బొబ్బిలి, పార్వతీపురం పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలోగల ఈఈలు, డీఈఈలు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన మండలాల వారీగా సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సచివాలయం భవనాలు, వెల్నెస్ సెంటర్లు, ఆర్బీకే భవనాలు ఏయే మండలంలో ఎన్నెన్ని మంజూరయ్యాయి.. ఎన్ని పూర్తి చేశారు.. ఇంకా ఎన్ని పూర్తి చేయాల్సి ఉంది.. తదితర అంశాలను సీఈ ఆరా తీసి, అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఆర్ఐ పనులను కూడా తమ పరిధిలోనికి అప్పగించాలని స్థానిక డీఈఈ అప్పారావు సీఈని కోరారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి పంచాయతీరాజ్ డివిజన్ ఈఈ శ్రీనివాసులు, డీఈఈలు, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి

శీలవలసకు విద్యుత్తు వెలుగులు


శీలవలసకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెంటాడ: మండలంలోని కొండలింగాలవలస పంచాయతీ మధురమారుమూల గిరిజన గ్రామమైన శీలవలసకు ఎట్టకేలకు విద్యుత్తు సౌకర్యం కలిగింది. శీలవలస దుస్థితిని గతేడాదిఅక్టోబరులో ఆంధ్రజ్యోతి 'అక్కడ ఓ ఊరుందని తెలుసా?' శీర్షికతో వెలుగులోకి తెచ్చింది. ఈనేపథ్యంలో ప్రజాప్రతినిధులు, నేతల్లో కదలిక మొదలైంది. ముందుగా విద్యుత్తు సౌకర్యంపై దృష్టి సారించిన యంత్రాంగం సవరవిల్లి గ్రామం నుంచి ఈ గ్రామం వరకు విద్యుత్తు లైను పనులు పూర్తి చేశారు. వీలైనంత త్వరలో గృహాలకు కూడా కనెక్షన్లు మంజూరు చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ తిరుపతిరావు తెలిపారు. రహదారి, తాగునీటి సౌకర్యాలు కూడా కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని సంబంధిత శాఖల అధికారులు చెబుతున్నారు.

దివ్య జీవన సత్సంగం

వీరఘట్టం: వీరఘట్టం శాంతి ఆశ్రమంలో ఆదివారం దివ్యజీవన సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండకు చెందిన సత్యసాయి ప్రతినిధి ఎన్‌వీ రమణ ఆధ్యాత్మిక విషయాలను బోధించారు.భగవద్గీత, రామాయణంలోని ప్రధాన ఘట్టాలను వివరించారు.

కొనసాగుతున్న 'జయహో బీసీ'



మాట్లాడుతున్న టీడీపీ బీసీ విభాగం నాయకులు

విజయనగరం రూరల్, మార్చి 3: టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న 'జయహో బీసీ' కార్యక్రమాన్ని ఆదివారం 10, 11, 12 డివిజన్ల పరిధిలో నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కోండ్రు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో టీడీపీ బీసీ విభాగం నాయకులు కంది మురళీనాయుడు, వేచలపు శ్రీనివాసరావు, మామిడి దేవేంద్రనాథ్, పేరిశెట్టి గోపితో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా డివిజన్ల ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంచి వైద్యులకు గిరిజనులు బలి'

శృంగవరపుకోట రూరల్: మండలంలో ఉన్న గిరిజన గ్రామాల్లో చేతిసంచి వైద్యులు ఎంబీబీఎస్ డాక్టర్ల మాదిరి అమాయకపు గిరిజనులకు వైద్యం చేసి వారి మరణాలకు కారణం అవుతున్నారని మండల ఆదివాసి గిరిజన సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆదివారం సంఘ నాయకులు గౌరీష్, శివ, ఎరుకులమ్మ మాట్లాడుతూ గడిచిన కొద్దిరోజుల్లో సంచివైద్యుల చికిత్సకు నలుగురు అయాయకపు గిరిజనులు చనిపోయారన్నారు. రెండురోజుల క్రితం దబ్బగుంట గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు జమరాజుకు బాగోకపోతే ఒక సంచివైద్యుడు ఏవో ఇంజక్షన్లు చేస్తే అతను చనిపోయాడన్నారు. కొద్దిరోజుల వ్యవధిలో మూలబొడ్డవరకు చెందిన గెమ్మెల ఎర్రయ్య, గాదెల్లోవాకు చెందిన ఇద్దరు చనిపోయారని, ఈ మరణాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక విచారణ జరిపించి సంచివైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

41 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక

రాజాం: స్థానిక సత్యసాయి సేవాసమితి సత్యం మందిరంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సాయంతో ఆదివారం నిర్వహించి ఉచిత కంటి పరీక్షలకు 101 మంది హాజరుకాగా 41 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యం మందిరం సభ్యులు జీఎంఆర్ పీఏ ఆర్.అన్నంనాయుడు, కె.బసవరాజు, కృష్ణారావు, కోట్ల ఏడుకొండలరావు, కొత్తా అనంతరావు, శీమకుర్తి ప్రసాదరావు, జనగం వెంకటరావు, భద్రుడు, కార్తీక్, వెంకటేష్, సాయి మల్లేసు పాల్గొన్నారు.

వినాయకనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ వినాయకనగర్‌లో ఆదివారం విశాఖపట్టణానికి చెందిన మెడికవర్ ఆసుపత్రి వైద్యులతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వినాయక నగర్‌కు చెందిన ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 100 మంది రోగులకు వివిధ రకాల తనిఖీలను నిర్వహించి మందులను ఉచితంగా అందచేశారు. దాతల సాయంతో 42 మంది ఒంటరిగా నివాసం ఉంటున్న వృద్ధ మహిళలకు, వృద్ధులకు బియ్యంతో సహా 12 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. జనసేన శృంగవరపుకోట ఇన్‌చార్జి వబ్బిన సత్యనారాయణ, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు, వాసవి యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువకేంద్రం అడ్వైజరీ కమిటీ మెంబరుగా పిళ్లా

విజయనగరం దాసన్నపేట: నెహ్రూ యువ కేంద్రం అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా జిల్లాలోని గంట్యాడ మండలం పెనసాం గ్రామానికి చెందిన పిళ్లా నవీన్‌కుమార్ నియమితులయ్యారు. కేంద్ర యూత్ ఆఫెర్స్ అండ్ స్పోర్ట్సు మంత్రి అనురాగ్ ఠాగూర్ ఉత్తర్వులు జారీ చేశారు. నవీన్‌కుమార్ బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తనను ఈ నియామకానికి సహక రించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ, జిల్లా అధ్యక్షులు ఎన్ఈఆర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మిట్లా వంశీలకు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గాయత్రి ఆలయానికి తాగునీటి బోరు వితరణ

లక్కవరపుకోట: ఉత్తరాంధ్ర కల్పవల్లి ప్రత్యేక ప్రసిద్ధి చెందిన వేదమాత గాయత్రిదేవి ఆలయానికి ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంచినీటి బోరు వితరణ చేశారు. మండలంలోని రేగ గ్రామంలో వెలసిన గాయత్రిమాత అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఈ బోరు ఉపయోగపడుతుందని గ్రామస్థులు తెలిపారు. ఆదివారం గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ యడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ రావాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంచినీటి బోరు వేసినట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో కక్కల ఈశ్వర రావు, రావాడ సన్యాసినాయుడు, స్వామినాయుడు, యడ్ల అప్పారావు, నాయుడుబాబు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ టెస్ట్‌కు స్పందన



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట రూరల్: మండలంలో ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించి వారికి రూ లక్ష 25వేలు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు మండలంలోని భవానీ నగర్ డాక్టర్ వరలక్ష్మి పాఠశాల స్కాలర్‌షిప్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ పొట్నూరి వరలక్ష్మి, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చదువులో ఆణిముత్యాలను వెలుగులోకి తేచ్చేందుకు ఈ పరీక్షలు నిర్వహించామన్నారు.

ఆంధ్రా బ్యాంకు రిటైర్డు ఎంప్లాయిస్ కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 3: విజయన గరం కేంద్రంగా యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రత్యేక రీజనల్‌కార్యాలయం ఏర్పరిచిన దరిమిలా యూనియన్ బ్యాంకులో విలీనమైన ఆంధ్రాబ్యాంకునకు చెందిన ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగులు నూతన కార్యవర్గ ఎంపికను ఆదివారం ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ యూనిట్ విజయనగరం నుంచి అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ భోగ రాజు బాపూజీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరుగా బొడ్డు కోటేశ్వరరావు, స్పెషల్ ఇన్విటీ సభ్యుడిగా పి గోవింద కృషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆల్ ఇండియా అధ్యక్షుడు వారణాసి కృష్ణమూర్తి మాట్లాడుతూ, రిటైర్డు బ్యాంకు ఉద్యోగులకు ఆరోగ్యబీమా ప్రీమియం భారం తగ్గించాలని, పెన్షన్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సచివాలయాలను సైతం తాకట్టు పెట్టేశారు

- సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ అభ్యర్థుల ప్రచారం
- వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శ



నగరంలో సూపర్ సిక్స్ హామీలను వివరిస్తున్న అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు



మక్కువ: పర్యటిస్తున్న సంధ్యారాణి

విజయనగరం రూరల్, మార్చి 3: రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన, అప్పుల అప్పారావు (జగన్మోహన్‌రెడ్డి) చివరకు సచివాలయాలను తాకట్టు పెట్టేశారని విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా 38, 39 డివిజన్ల పరిధిలోని బొబ్బాదిపేట, మహాలక్ష్మీ నగర్, సచివాలయం వీధి, సైలాడ కాలనీ, ఆదిత్య నగర్, ఉడాకాలనీ ఫేజ్-3లో ఆమె ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్నింటినీ హోల్‌సేల్‌గా తాకట్టుపెట్టేస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే.. రాష్ట్రంలో ప్రజా, ప్రభుత్వ ఆస్తి ఏదీ మిగలదని, రానున్న ఎన్నికల్లో తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తే, ఇబ్బందికర పరిస్థితి ఉంటుందన్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే, తెలుగుదేశం పార్టీ ఒక్కటే మార్గమన్నారు. ప్రజలంతా ఆలోచన చేసి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీని గెలిపించాలన్నారు. రాష్ట్రంలో మహిళా సంక్షేమం లేదని, రక్షణ కూడా లేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు ప్రకటించారని, ప్రజలంతా టీడీపీకి మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొర్నాన రాజ్యలక్ష్మి, నమ్మి చిట్టిబాబు, కుచ్చర్లపాటి హరిప్రసాదరాజు, పాలూరు రాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● విజయనగరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనని గెలిపించాలని కోరుతూ, పలు వర్గాలను కలిసి మద్దతు కోరుతున్న అదితి గజపతి రాజు ఆదివారం ఉదయం ఆయోధ్యమై దానంలో వాకింగ్ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులని కలిసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. తిరోగమనంలోకి వెళ్లి న రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే టీడీపీయే రావాలన్నారు. చంద్రబాబు లాంటి విజ నరీ నాయకుడిని ముఖ్యమంత్రిగా చేయాలన్నారు. ● **మక్కువ:** రానున్న సార్వ త్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ విజయం ఖాయమని సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బంగారువలస గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్య త్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలకు ప్రజల్లో ఆదరణ పెరి గిందన్నారు. తనను గెలిపిస్తే సాలూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామ వీధుల్లో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం టీ డీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుళ్ల వే ణుగోపాల్, మత్స భాస్కరరావు, గౌరీశంకర్, డాక్టర్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి చేతులు కలపాలి

● రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్



మాట్లాడుతున్న కోండ్రు మురళీమోహన్

రాజాం: రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల నాయ కులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం జగన్ దెబ్బ కొట్టారన్నారు. సీఎం జగన్‌పాలనలో రాష్ట్రం అంధకారంగా మారిందన్నారు. పేదలకు ఏడాది ఐదులక్షలు చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి మాటతప్పారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి గృహ నిర్మాణం పేరుతో పేదలను అప్పుల పాలుచేశారన్నారు. గృహాలు నిర్మించకపోతే ఇచ్చిన స్థలం పట్టాలు రద్దుచేస్తామని బెదిరించి పేదల చేత అప్పులు చేయించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. గురవాన నారాయణరావు, నాగళ్ల అప్పలనాయుడు, బెజ్జిపురపు త్రినాథ, దుప్పలపూడి శ్రీనివాసరావు, వంగ వెంకటరావు, పొన్నాడ భీమేశ్వరరావు పాల్గొన్నారు.

● సీఎం జగన్ దళిత ద్రోహి అని, దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో ఆదివారం వంగర మండలం కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన 40 ఎస్టీ కుటుంబాలు, రేగిడి మండలంలోని బాలకాయవలసకు చెందిన 30 మంది వైసీపీకి చెందిన యువకులు టీడీపీలో చేరారు. వైసీపీకి చెందిన రౌల బుచ్చిందొర, ఒమ్మి నందయ్య దొర, వంటల సింహాచలం దొర, బంటుపల్లి రామందొర, దంపల సత్యం దొర, బంటుపల్లి రమణందొర, సురేష్‌దొర టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిన్నింటి మోహన్‌రావు, భీమవరం భాస్కరరావు, లక్షుభక్త కృష్ణమూర్తి, యలకల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో జగన్‌పై విచారణ చేపట్టాలి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: రాజకీయ లబ్ధి కోసం వై ఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హత మార్చిందని దీనిపై జగన్ పాత్రపైన ప్రజలకు అనుమానాలు ఉన్నందున విచారణ చేపట్టాలని టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాల యంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన సోదరి ప్రశ్నించిన వాటికి జగన్ జవాబు చెప్పాలన్నారు. ఇప్పటికైనా శవ రాజకీయాలు మానుకోవా లని హితువు పలికారు. సునీతమ్మ చెప్పినట్లుగా జగన్ రెడ్డిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని దోలపాలెం, బంగారమ్మపేట గ్రామాల్లో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యా డ శ్రీదేవి, బొండపల్లి మాజీ ఉపాధ్యక్షుడు బొడ్డు రా ము, జానకీరామ్, పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారంపై ఫిర్యాదు



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ సోషల్ మీడియా ప్రతినిదులు

లక్కవరపుకోట, మార్చి 3: ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మె ల్యే కోళ్ల లలితకుమారి కుటుంబంపై గుర్తుతెలి యని వ్యక్తి సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేయడాన్ని గమనించిన టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి సాగర్ కల్యాణ్ ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో కార్యకర్తలతో కలిసి ఫిర్యాదు చేశారు. టిక్కెట్ విషయంలోనూ, కుటుంబం ఆరోగ్యంపైనా, లోకేష్ కోళ్ల కుటుంబానికి అన్యాయం చేసినట్లుగా తప్పుడు వార్తలు సృష్టించి ప్రచారాలు చేస్తున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అజ్ఞాత వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారన్నారు. అక్కిరెడ్డి రమణ, మల్లా రామకృష్ణ, కొటాన విజయ్‌కుమార్, భూపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



జామిలో జనసైనికుల సమావేశం

జామి, మార్చి 3: వైసీపీ ప్రభుత్వం అవ లంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి పూ ర్తిస్థాయిలో తీసుకెళ్లాలని, ముఖ్యంగా సంక్షేమం పేరుతో మనల్ని ఎలా దో చుకుంటున్నారో వివ రించాలని జనసేన పార్టీ జిల్లా నాయకుడు పీవీఆర్ వర్మరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన జామిలో పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించారు. జనసేనాని ఇచ్చిన ఆదేశాలను ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని, ఎవరు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన వెనక్కి తగ్గొద్దని, ఈ ప్రభుత్వ ఓటమే ధ్యేయంగా ప్రతి జనసైనికుడు, వీరమహిళలు ముందుకు దూసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్‌ని హెచ్చరిస్తున్న సీఐ వెంకటరావు

విజయనగరం క్రైం, మార్చి 3: జిల్లా కేంద్రంలో వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ వెంకటరావు హెచ్చరించారు. ఆదివారం ఎస్పీ దీపికా ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. ఎస్ఐలు తారకేశ్వరరావు, నరేష్, హరిబాబునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాస ప్రాంతంలో మురుగు నీటి శుద్ధి ప్లాంటా?

● నిరసిస్తూ ధర్నా చేసిన కార్మికులు



ధర్నాచేస్తున్న పారిశుధ్య కార్మికులు

బొబ్బిలి, మార్చి 3: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నివాసముండే కాలనీ ప్రాంతంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పూర్తిగా విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల కాలనీ వెనుక ప్రాంతంలో 1.10 ఎకరాల స్థలంలో గతంలో కంపోస్టుయార్డు ఉండేదని, దానిని ఖాళీ చేసిన తరువాత ఆ స్థలంలో పారిశుధ్య కార్మికులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నామన్నారు. 1992లో ఇందుకోసం ఒక్కో కుటుంబం నుంచి ఇళ్ల పట్టాల కోసం 350 రూపాయలను వసూలు చేశారన్నారు. ఇన్నాళ్లూ పట్టాలు ఇస్తామని చెప్పిన పలు పాలకవర్గాలు మారిపోయాయన్నారు. జగన్ హయాంలో పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్లు గొప్పగా చెప్పుకుంటున్నా పారిశుధ్య కార్మికులు ఒక్కో ఇంట్లో రెండు మూడు కుటుంబాలు చాలా దుర్భరంగా జీవిస్తున్నాయని, వారి సంక్షేమంపై ప్రభుత్వానికి పట్టడం లేదని ఆయన ఆరోపించారు. ● 7.70 కోట్ల రూపాయలతో ఈ స్థలంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడం చాలా అన్యాయమన్నారు. పారిశుధ్య కార్మికుల స్వాధీనంలో ఉన్న ఈ స్థలాన్ని ఇళ్లపట్టాలకు తప్ప ఇంకే అవసరాలకు వినియోగించినా వ్యతిరేకిస్తామన్నారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలు గుప్పించి ఓట్లు గుంజుకున్నారని, ఇప్పుడేమో ఆకస్మికంగా కార్మికులను వంచనకు గురిచేసి పట్టాలు ఇవ్వకుండా వారి నెత్తిపై మరో కుంపటి లాంటిది పెట్టడానికి చూస్తున్నారన్నారు. ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదని, మున్సిపాలిటీ తన ప్రతిపాదనను విరమించుకొని పారిశుధ్య కార్మికులకు ఇళ్లస్థలాలు కేటాయించి, అత్యాధునిక వసతులతో మోడల్ కాలనీని నిర్మించాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని శంకరరావు హెచ్చరించారు. కార్యక్రమంలో వాసు, జగదీశ్, మజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో కూలిన భారీ వృక్షం

● ఒకరు మృతి



శ్రీనివాస్(ఫైల్)

రాజాం/రూరల్: పురపాలక సంఘం పరిధిలోని చీపురుపల్లి రోడ్డులో గల ఎర్రచెరువు గట్టుపై ఉన్న వందేళ్ల నాటి భారీ వృక్షం ఆదివారం కుప్పకూలింది. నిత్యం వందలాది వాహనాలు తిరుగాడే ఈ మార్గంలో ఆదివారం జనసంచారం లేని సమయంలో నేలకొరగడంతో పెనుప్రమాదం తప్పింది. చెట్టు నేలకొరిగే సమయంలో సమీపంలో గల షాపుల వద్ద ఉన్నవారిలో కొంతమంది తప్పించు కున్నారు. ఆ సమయంలో చీపురుపల్లి రోడ్ నుంచి కొండంపేట గ్రామానికి చెందిన ముద్దన శ్రీనివాస్ తన ద్విచక్రవాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. దీంతో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. ద్విచక్రవాహనం సైతం దెబ్బతింది. ప్రమాదం సంభవించిన వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విశాఖ, విజయనగరం మీదుగా రాజాం, ఇటు నుంచి ఆయా పట్టణాల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను పోలీస్‌స్టేషన్, ఠాణావీధి, శ్రీనివాసారోడ్ మీదుగా అంబేడ్కర్ జంక్షన్ వరకూ దారి మళ్లించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉండడంతో రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ రాత్రి మృతిచెందాడు. శ్రీనివాస్ సంకిలి షుగర్స్‌లో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. చెట్టును మునిసిపల్, ఆర్అండ్‌బీ అధికారులు తొలగించే పనులు చేస్తున్నారు.



రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం

అధికారుల నిర్లక్ష్యం..

ఏక్షణాన్నైనా కూలిపోయే పరిస్థితుల్లో ఉన్న వందేళ్ల నాటి రావిచెట్టును తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆరోపించారు. ఈ చెట్టు కూలిపోయే పరిస్థితి గురించి పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా, పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తొలగించే ప్రయత్నం చేయలేదని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఏడాది జనవరిలో ఈ చెట్టుకు అడుగుభాగంలో గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టిన విషయం విదితమే.అప్పటి నుంచి రెండు నెలలుగా చెట్టు అడుగుభాగంలో పొగలువస్తున్నా ఆర్అండ్‌బీ, మునిసిపల్, పోలీస్ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఉన్నఫలంగా భారీ వృక్షం నేలకూలింది. ఇదిలా ఉంటే ఎర్రచెరువు గట్టుపై ఖరీదైన ఈ స్థలాన్ని ఆక్రమించే ఉద్దేశంతో చెట్టుకు నిప్పు పెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చెట్టును ఢీకొన్న కారు

● ఒకరు మృతి, మరొకరికి గాయాలు

రామభద్రపురం, మార్చి 3: మండల పరిధిలోని కొట్టక్కి ఎరుకుల పాకల వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయాలైనట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. సాలూరు బంగారమ్మ కాలనీకి చెందిన తాడుతూరి శ్రీను(45) ట్యాక్సీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుకింగ్ నిమిత్తం ట్యాక్సీపై విశాఖపట్టణం వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతిచెందగా కారులో ఉన్న రవికుమార్‌కు గాయాలయ్యాయి. మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించి ఎస్ఐ జ్ఞానప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. యువకుడి మృతి

సీతంపేట: కుశిమి జంక్షన్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఆదివారం ఢీకొన్న సంఘటనలో రేగిడి ఆమదాలవలసకు చెందిన మణికంఠ (23) యువకుడు మృతిచెందాడు. సీతంపేట పోలీసుల కథనం మేరకు.. సీతంపేట ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్ సందర్శించి ఒకే ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు రేగిడి ఆమదాలవలస తిరుగు ప్రయాణమయ్యారు. స్టేషన్ ఆమదాలవలస నుంచి కొత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వెళ్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలు కుశిమి జంక్షన్ సమీపంలో ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనం నడుపుతున్న మణికంఠ తలకు బలమైన గాయాలు తగలడంతో మెరుగైన వైద్యం నిమిత్తం పాలకొండ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తీవ్రగాయాలైన మిగతా వారిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాధితురాలు అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని కాగితాపల్లి రహదారి సెంటర్‌లో ఆదివారం బలిజపేట మండలంలోని గలావల్లికు చెందిన ఓ వ్యక్తి నుంచి 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వహణకు మద్యం తీసుకువెళ్తుండగా పట్టుబడినట్లు నిందితున్ని అరెస్టు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి పీఏసీఎస్ ఉద్యోగుల సహాయ నిరాకరణ

● పీఏసీఎస్ ఉద్యోగ సంఘ నాయకుడు కామేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు కామేశ్వరరావు

విజయనగరం దాసన్నపేట, మార్చి 3: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి కామేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 94 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు వున్నాయని, 300 మంది ఉద్యోగులు గత నాలుగు నెలలుగా తమ సమస్యలు పలు దఫాలుగా జిల్లా సహకార అధికారులకు తెలియజేసినా ఉద్యమా లు చేసినా పట్టించుకోలేదన్నారు. గత నెల 26న సమావేశం అనంతరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవోకు, జిల్లా సహకార అధికారికి వినతిపత్రం అంద జేశారన్నారు. అన్ని సంఘాల్లో ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని, డీసీసీ బీ కాకుండా పీఏసీఎస్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయాలని డీసీసీబీలు మాదిరిగా కంప్యూటీకరణ చేయాలని డిమాండ్ చేశారు. 2019 మార్చి 1 తరువాత చేరిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, 12 డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. నేటి నుంచి దశలవారీగా ఆందోళన చేపడతామని, 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు ఆర్ సత్యారావు, బి రామునాయుడు, ఎవీ సత్యనారాయణ, బి నారాయణరావు, వి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేనతోనే న్యాయం



మాట్లాడుతున్న సాయిరాం

తెర్లాం: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేనల ద్వారానే బీసీలకు న్యాయం జరుగుతుదని, బీసీల ఆత్మ గౌరవం నిలబెట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని అరసబలగ సర్పంచ్ కొరగంజి సాయిరాం అన్నారు. ఆదివారం బీసీ డిక్లరేషన్ పై పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ నెల 5వ తేదీన అమరావతిలో జరగబోయే బీసీ డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సభలో జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్, మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, బొబ్బిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ తిరుమలేశు, ఇతర ప్రజాప్రతిదులు పాల్గొంటారని తెలిపారు. ప్రస్తుతం బీసీలు, ఎస్సీలపై దాడులు పెరిగాయని మండిపడ్డారు. కావున బీసీలంతా ఏకత్రాటిపై నడిచి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలోని బీసీ నాయకులు, తెలుగుదేశం కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

'చదవడం మాకిష్టం'

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్య క్రమంలో విద్యార్థులతో తెనాలి రామకృష్ణ కథలు, బాల మిత్ర కథలు, నీతి కథలు చదివించడం, చెప్పించడం జరిగిందన్నారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

బీజేపీ పథకాలను వివరించండి



యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

కొత్తవలస, మార్చి 3: వాడవాడకు వెళ్లి భారతీయ జనతా పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే ధ్యేయంగా ప్రజాపోరు యాత్ర చేపట్టామని బీజేపీ విశాఖపార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడపాటి రవీంద్ర అన్నారు. ఆదివారం శృంగవరపుకోట నియోజకవర్గానికి సంబంధించి ప్రజాపోరు యాత్రరథాన్ని ఆయన కొత్తవలస బీజేపీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలలో అవగాన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీజేపీ నాయకులు శ్రీరంగం ధానేష్, వసంత వర్మ, యలమంచిలి ప్రసాద్, చొక్కాకుల అప్పారావు, చొక్కాకుల జగదీశ్వరి, ములగపాక త్రినాథ్, గోకాడ మహేష్, గోవింద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.